క్లుప్తంగా

కొత్తకాయలతిప్పలో ఫ్యామిలీ ఫిజీషియన్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: మొగల్తూరు 3వ సచివాలయ పరిధిలోని కొత్తకాయలతిప్పలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ దినేష్ సుమారు 70 రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో లేవలేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వారిని పరీక్షించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వి.సునీత, దివ్య, మధుసూదనరావు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

నరసాపురం: ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ కరెంటు కనెక్షన్‌ను ఆధార్ నెంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ బళ్ల సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ సిబ్బందికి ఆధార్ జిరాక్స్ అందజేసి సహకరించాలన్నారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు మీ సేవ కేంద్రంలో ఆధార్ జిరాక్స్‌లు అందించాలన్నారు. విద్యుత్ కనెక్షన్ పూర్వీకుల పేరున ఉన్నవారు కూడా ప్రస్తుత వారసులు తమ ఆధార్ నెంబర్ ఇచ్చి పేరు మార్చుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

నరసాపురం రూరల్: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యాన సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ తెలిపారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం పోలీసు అధికారులతో కోర్టు హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. రాజీ చేసుకోవడం ద్వారా కట్టిన కోర్టు ఫీజును వాపసు ఇస్తారని తెలియజేయాలన్నారు. లోక్ అదాలత్‌లో జరిగిన రాజీ అంతిమ తీర్పు అని అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ వంశీధర్, నరసాపురం టౌన్, రూరల్, యలమంచిలి సబ్ ఇన్‌స్పెక్టర్లు, లైజనింగ్ ఆఫీసర్లు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమాజానికి వెలుగు



కృష్ణాజీని సన్మానిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: సమాజానికి వెలుగునిచ్చే గౌరవ ప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తమ గ్రామంలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన కృష్ణాజీ మాస్టారు సేవలు ఎనలేనివని శిరగాలపల్లి సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి అన్నారు. గ్రామంలోని నెంబర్-1 పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి పదోన్నతిపై కొడమంచిలి హైస్కూల్‌కు ఇంగ్లీష్ టీచర్‌గా వెళ్లిన మొల్లేటి కృష్ణాజీని బుధవారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడిగా విద్యాభివృద్ధికి కృషి చేస్తూనే పాఠశాల అభివృద్ధి కూడా పనిచేసిన కృష్ణాజీని గ్రామస్తులంతా గుర్తించుకుంటారని కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పైడి పోలు, మాజీ సర్పంచ్ పైడి వెంకటేశ్వరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పి.రవిబాబు, ప్రధానోపాధ్యాయుడు వి రవిచంద్ర, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

భీమవరం ఎక్సైజ్ డిపో మేనేజర్‌గా రంగారెడ్డి

సాక్షి, భీమవరం: భీమవరం ఎక్సైజ్ డిపో మేనేజర్‌గా ఎల్.రంగారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రంగారెడ్డి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చురుగ్గా ఓపెన్ ఆడిటోరియం పనులు

- రూ.3.50 కోట్లతో నిర్మాణం
- మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానే ఏర్పాటు
- మున్సిపాలిటీకి భారీగా పెరగనున్న ఆదాయం



నరసాపురంలో నిర్మితమవుతున్న ఓపెన్ ఆడిటోరియం

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ కార్యాలయం పక్కన విశాల స్థలంలో నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానే అధునాతన వసతులతో నిర్మించనున్న ఓపెన్ ఆడిటోరియం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.3.50 కోట్లతో ఈ ఓపెన్ ఆడిటోరియంను నిర్మిస్తున్నారు. 6 నెలల్లో ఆడిటోరియంను అందుబాటులోకి తెచ్చేలా పనులు చురుగ్గా కొనసాగిస్తున్నారు. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉండటానికి భారీ విస్తీర్ణంలో విలువైన ప్రాంతంలో ఉంది, కానీ మున్సిపాలిటీకి ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. పైపెచ్చు థియేటర్ నిర్వహణ మున్సిపాలిటీకి భారంగా కూడా మారింది. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ.3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణ పనులను గత ఫిబ్రవరి నెలలో చేపట్టారు. వచ్చే మే నెల పెళ్లిళ్ల సీజన్ నాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించి ముందుకెళుతున్నారు.

1991లో ఓపెన్ ఎయిర్ థియేటర్

1991లో రూ.5 లక్షల వ్యయంతో ఓపెన్ ఎయిర్ థియేటర్ భవనాన్ని నిర్మించారు. రెండెకరాల స్థలంలో మున్సిపల్ కార్యాలయం పక్కనే భవన నిర్మాణం జరిగింది. అయితే థియేటర్‌లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వివాహాలు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. థియేటర్ ద్వారా మున్సిపాలిటీకి సంవత్సరానికి కేవలం రూ.3 వేలు మాత్రమే ఆదాయం వస్తుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. థియేటర్‌కు నెల నెలా చెల్లించే కరెంటు బిల్లు, వాచ్‌మెన్ జీతం ఇలా ఏడాది పొడవునా థియేటర్ నిర్వహణకు వచ్చే ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ అవుతోంది. పాత భవనాన్ని పూర్తిగా పడగొట్టి అధునాతన ఆడిటోరియం భవనాన్ని నిర్మిస్తున్నారు.

సామాన్యులకు అందుబాటులో..

పట్టణంలో కళ్యాణ మండపాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, అందుబాటులో ఉన్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ఎమ్మెల్యే ముదునూరి భావించి ముందడుగు వేశారు. ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తే మున్సిపాలిటీకి సంవత్సరానికి లక్షల్లో ఆదాయం వస్తుంది. మధ్య తరగతి, సామాన్యులు తక్కువ ఖర్చుతో ఫంక్షన్లు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

కార్పొరేట్ రీతిలో నిర్మాణం



నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను రూ.3.50 కోట్లతో అధునాతన ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేస్తున్నాం. ఇందుకు కోసం మున్సిపల్ సాధారణ నిధులను కూడా ఖర్చు చేస్తున్నాం. ఇక నుంచి అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు కూడా ఇక్కడే నిర్వహించేలా భవన నిర్మాణం చేస్తున్నాం. త్వరలోనే మంచి సెంటర్‌లో పార్కింగ్‌కు కూడా ఇబ్బంది లేకుండా కొత్త ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తుంది.

— ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

రాయకుదురు కాలువలో చెత్తపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

పెనుమంట్ర: విద్యుత్ అధికారుల నిర్వాకం, నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బ్రాహ్మణ చెర్వు వద్ద రాయకుదురు కాలువలో పేరుకుపోతున్న చెత్త, దాని నుంచి వస్తున్న దుర్గంధం భరించలేక పోతున్నామని, అధికారులకు 10 రోజులుగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన ఉందుర్తి కృష్ణమూర్తి, తిప్పరపల్లి భాస్కరరావు బుధవారం ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. బ్రాహ్మణ చెర్వు వద్ద కాలువ గట్టు చెట్లను విద్యుత్ అధికారులు కొట్టించి, కాలువలో పారేయడంతో గోస్తనీ పంట కాలువ నుంచి వస్తున్న చెత్త, జంతువుల మృత కళేబరాలు ఇక్కడ అడ్డుపడి దుర్గంధం వెదజల్లుతోందని, చెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీ.. ఇద్దరికి గాయాలు

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల కూడలిలో బుధవారం సాయంత్రం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి, వీరిలో ఒకరు సత్యవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. 108 అంబులెన్స్ వచ్చేలోపే ప్రయివేటు వాహనంపై ఒకరిని మార్టేరులోని ఆసుపత్రికి, మరొకరిని పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం.

అంకితభావంతో పనిచేద్దాం

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు గుడాల గోపి పిలుపు



దొడ్డిపట్లలో పార్టీ శ్రేణులతో పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: వైఎస్సార్ సీపీ పట్ల అంకితభావంతో పనిచేసి పాలకొల్లులో పార్టీ జెండాను ఎగురవేద్దామని పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారిగా బుధవారం యలమంచిలి మండలంలో పర్యటించారు. నియోజకవర్గానికి ఈశాన్య గ్రామమైన కంచుస్తంభంపాలెంలో ఆయన పర్యటన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ ప్రాంతం కొత్తయినా సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాల మేరకు అందరినీ కలుపుకుని పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. ఏ అవసరం వచ్చినా ఎప్పుడైనా తనకు ఫోన్ చేయవచ్చునని ఆయన చెప్పారు. కంచుస్తంభపాలెంతో పాటు బూరుగుపల్లి, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, నారినమెరక గ్రామాల్లో ఆయన పర్యటించారు. గోపి వెంట పార్టీ చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి



పాలకొల్లులో నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘ సభ్యులు

పాలకొల్లు అర్బన్: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం జయంతిని దిగమర్రు శివాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. అర్చకస్వామి చేబ్రోలు బాలకృష్ణ గాంధీ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంచారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తమ్మినీడి వెంకటేశ్వరరావు, పితాని సత్యనారాయణ, చేబ్రోలు శ్రీనివాస రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన..

పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడని శ్రీ క్షీరారామ బ్రాహ్మణ సేవా సంఘ సభ్యుడు సోమంచి శ్రీనివాస శాస్త్రి అన్నారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు చెరావూరి నరసింహమూర్తి, నందుల దశరథ్, గోటేటి వెంకటేశ్వరరావు, హోతా హరినారాయణ, నండూరి జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి పరిశోధనా స్థానంలో..

పెనుమంట్ర: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. సభకు అధ్యక్షత వహించిన మార్టేరు పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామభద్రరాజు, శాస్త్రవేత్తలు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.



అంజలి ఘటిస్తున్న సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

నరసాపురం రూరల్ : విశాలాంధ్ర ఔనత్యం కోసం అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో యేడిద శ్రీనివాస్ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో టంగుటూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మ గౌరవం కోసం ప్రకాశం పంతులు అవిశ్రాంత పోరాటం చేశారన్నారు. మద్రాసు రాష్ట్రం నుండి ప్రత్యేక విశాలాంధ్ర ఆవిర్భావానికి కృషి చేసిన వ్యక్తని ఆయన అన్నారు. సూర్య కళాశాలలో ఏర్పాటు చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి కళాశాల కార్యదర్శి బ్రహ్మాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు



పాలకొల్లులో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పాలకొల్లు సెంట్రల్: చంద్రమండలం దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించడం దేశానికే గర్వకారణమని పట్టణానికి చెందిన పలు సేవా సంస్థల సభ్యులు అన్నారు. బుధవారం జాబిల్లిపై చంద్రయాన్-3 విజయవంతంగా దిగడాన్ని పురస్కరించుకుని స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో జాతీయ జెండాలు చేతపట్టి, బాణసంచా కాలుస్తూ జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు వెన్నంటే ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్తా, గాది ఆంజనేయులు, జక్కంపూడి రామ్‌ప్రసాద్, దాశిరెడ్డి శ్రీనివాసు తతరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజ్‌లో ప్రత్యక్ష ప్రసారం

పెనుగొండ : చంద్రయాన్-3 విజయవంతంపై పెనుగొండలో ఆనంద హేల నెలకొంది. స్థానిక ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. విద్యార్థులు వందలాదిగా తిలకించారు. ల్యాండర్ ల్యాండ్ కాగానే విజయాన్ని పండుగలా చేసుకున్నారు. భారత ఖ్యాతిని ఇనుమడింప చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ కేవీవీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వడలిలో ర్యాలీ..

చంద్రయాన్ -3 విజయంపై వడలిలో జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తొలుత టీవీల్లో చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను తిలకించారు. అనంతరం ప్రధాన మంత్రి మోదీ ప్రసంగం పూర్తి కాగానే ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులు జయహో భారత్ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. పెనుగొండలోని భాష్యం, చైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులు చంద్రయాన్ యాత్ర తిలకించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చంద్రయాన్ - 3 ల్యాండింగ్ దృశ్యాలు ప్రత్యక్ష వీక్షణ



చంద్రయాన్ -3 ల్యాండింగ్ దృశ్యాలను వీక్షిస్తున్న ఉల్లంపర్రు మాంటిస్సోరీ విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: చంద్రునిపై శాటిలైట్ ల్యాండింగైన దృశ్యాలను ప్రత్యక్షంగా వీక్షించడం ఆనందంగా ఉందని ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్ అన్నారు. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ - 3 ల్యాండింగ్‌ను స్కూల్‌లో బుధవారం సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది వీక్షించారు. స్కూల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 3 స్క్రీన్‌లపై విద్యార్థులు వీక్షించారు. స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎంఎస్ వాసు మాట్లాడుతూ జులై 14న శ్రీహరికోట నుంచి నింగిలోకి రివ్వున దూసుకెళ్లిన రాకెట్ 41 రోజుల తరువాత చంద్రుడి దక్షిణ ధృవం మీద కాలుమోపిందన్నారు. చంద్రయాన్ - 3 విజయవంతం కావడంతో ప్రపంచ దేశాల్లో భారతదేశ చరిత్ర పుటల్లో తిరుగులేని రికార్డు సాధించిందన్నారు.

ఎరువుల వినియోగం తగ్గించండి



నవుదూరు గరువులో ఈ-క్రాప్ నమోదును పర్యవేక్షిస్తున్న ఏఈ రహీమ్

మొగల్తూరు: ఎరువుల వినియోగం తగ్గించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ కోరారు. శేరేపాలెం పంచాయతీ నవుదూరు గరువులో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సార్వా సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించుకోవాలన్నారు. గ్రామంలోని వ్యవసాయ భూములను పరిశీలించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ-క్రాప్ నమోదు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రాయితీ వంటివి పొందవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగే మేలు

పాలకొల్లు అర్బన్: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి పండించిన ఆహార పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలని మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ తెలిపారు. మండలంలోని చింతపర్రు సచివాలయం వద్ద బుధవారం 60 మంది రైతులు, డ్వాక్రా మహిళలకు ఎస్2ఎస్ కిట్లు సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు చేతుల మీదుగా అందజేశారు. ప్రకృతి వ్యవసాయాధికారి ఎస్.నూకరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు విధానం, నవ ధాన్యలపై అవగాహన కల్పించారు. జిల్లా సమన్వయకర్త అరుణకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై సీఐలకు ప్రత్యేక శిక్షణ

జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్



మొగల్తూరు పోలీస్ స్టేషన్ వద్ద డీఎస్పీతో మాట్లాడుతున్న ఎస్పీ యు.రవిప్రకాష్

మొగల్తూరు: సైబర్ క్రైమ్‌పై సీఐలకు ప్రత్యేక శిక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సైబర్ క్రైమ్‌పై సీఐ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సెల్‌ఫోన్‌ల వాడకం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారితో మాట్లాడటం, కొత్త నెంబర్ల నుంచి ఫోన్ వస్తే మాట్లాడకపోవడం మంచిదన్నారు. గేమ్‌లు అప్‌లోడ్ చేసుకోవడం, వ్యాపార విషయాలు మాట్లాడుకోవడం చేయరాదన్నారు. వ్యక్తిగత వివరాలను సెల్‌ఫోన్‌లో నమోదు చేయరాదన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని, ప్రతి ఒక్కరూ హెల్మెట్‌లు ధరించాలన్నారు. కేసుల రికవరీలో 60 శాతం నమోదుతో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ రేటు మెరుగ్గా ఉందన్నారు. పేరుపాలెం బీచ్‌కు వచ్చే పర్యాటకుల కోసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవి మనోహర ఆచారి, ఎస్ఐ ఎం.వీరబాబు తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

వీరవాసరం: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా ఏపీడీ విజయలక్ష్మి తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవో కే జ్యోతి, టిఏ సుధీర్, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంధ్య తల్లిదండ్రులకు పీవీఎల్ పరామర్శ

ఆకివీడు : భర్త చేతిలో కిరాతకంగా హత్యకు గురైన కమల సంధ్య కుటుంబ సభ్యులకు రక్షణ కల్పిస్తామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు, మానవ హక్కుల సంఘ సభ్యురాలు బూసి వినీత హామీ ఇచ్చారు. బుధవారం వారి ఇంటికి వెళ్లి సంధ్య తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా కమల సంధ్య హత్యకు గురైన విషయాల్ని తెలియజేస్తుండగా పీవీఎల్ కంట తడిపెట్టారు. ఆయన మాట్లాడుతూ క్రూరమైన సంఘటనగా పేర్కొన్నారు. హంతకుడికి కఠిన శిక్షపడుతుందన్నారు. బెయిల్‌పై బయటకు వచ్చి మీకు ఫోన్‌చేసినా, బెదిరించినా, మళ్లీ జైలుకు వెళతాడని, కోర్టు తీర్పు కఠిన శిక్షపడే విధంగా ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. మానవ హక్కుల సంఘ సభ్యురాలు వినీత మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాల కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఐసీడీఎస్ సీడీపీఓ వాణీ విజయరత్నం, సూపర్‌వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డీఎన్ రాజుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నిరీక్షణరాజు

కాళ్ల : కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన సంఘ సేవకుడు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నిరీక్షణరాజు సన్ రైజ్ యూనివర్సిటీ - రాజస్థాన్ నుంచి డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. ఈమేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆక్వా కార్మికులు, పేదల కోసం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈనెల 21న గోవాలో నిర్వహించిన సమావేశంలో సన్‌రైజ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రధానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కోపల్లె గ్రామస్తులు నిరీక్షణరాజును అభినందించారు.

మోషేన్‌రాజును కలిసిన ఆకివీడు సీఐ

సాక్షి, భీమవరం: ఆకివీడు సీఐగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ బుధవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలకు కృషి చేయాలని మోషేన్‌రాజు సీఐకి సూచించారు.